
తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్టేట్ రౌండప్
STATE ROUNDUP
శనివారం 19 -04-2025 | పేజీ :-20





# రైతుల సంక్షేమం కోసం ఆత్మ కమిటీ

- సాగులో రైతులు అధునాతన పద్ధతులు పాటించేలా ఆత్మ కమిటీలు ప్రోత్సహించాలి
- నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న.
- అంచలంచలుగా అన్ని సమస్యలు పరిష్కారం
- వట్పల్లిలో 15 కోట్లతో ఏరియా ఆసుపత్రి
- అల్లాపూర్, సింగీతంలలో రూ.ఐదు కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
- ఆత్మ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం లో మంత్రి దామోదర్ రాజనర్సింహ

2లో

సంగారెడ్డి , ఏప్రిల్ 18 , ప్రజా జ్యోతి న్యూస్ ప్రతినిధి : ఆత్మ కమిటీలు రైతు సంక్షేమం కోసం పనిచేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం రాయికోడు ఆత్మ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం కారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. మునిపల్లి, రాయికోడ్, వట్టిపల్లి మండలాలు కు సంబంధించిన రాయికోడ్ ఆత్మ కమిటీ నూతన చైర్మన్ గా మెట్పల్లి మండలానికి చెందిన నాలచెరు కచూర్ రావు, పాలకవర్గ సభ్యులు శుక్రవారం రైకోడ్ మార్కెట్ కమిటీ ఆవరణలో నీ ఆత్మ కమిటీ కార్యాలయం వద్ద లో ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడారు. అందోల్ నియోజకవర్గంలోని వెనుకబడిన ప్రాంతాలైన రాయికోడ్,



# చిగురిస్తున్న ఆశలు

- భూ భారతి కింద పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మద్దూరులోని తహసీల్దార్ కార్యాలయం
- భూ భారతిలో సాదాబైనామాల పరిష్కారానికి హామీ
- ఉమ్మడి పాలమూరులో 29,375 పెండింగ్ దరఖాస్తులు
- దరఖాస్తు చేసుకొని ఐదేళ్లుగా రైతుల ఎదురుచూపులు
- పరిష్కారం బాధ్యత ఆర్డీవోలకు అప్పగింత
- చట్టం పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చిన తర్వాత కార్యాచరణ

మహబూబ్‌నగర్: భూ భారతి చట్టం ద్వారా సాదాబైనామాల దరఖాస్తులకు మోక్షం లభించే అవకాశం కనిపిస్తోంది. ధరణి అమల్లోకి వచ్చిన తర్వాత సాదాబైనామాల దరఖాస్తులు తీసుకున్నప్పటికీ.. ఆ పోర్టల్‌లో పరిష్కారానికి ఆప్షన్ లేకపోవడంతో దాదాపు అయిదేళ్లుగా రైతులు ఎదురుచూస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చింది. దాని అమలు కోసం పలు మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఆ మండలాల్లోని రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించి, రైతుల నుంచి ఫిర్యాదులు, దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాధారణంగా భూమి కొనుగోలు పద్ధతి రిజిష్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా ఉంటుంది. కొనుగోలు చేసిన వ్యక్తి సదరు డాక్యుమెంట్‌ను చూపించి.. అమ్మిన వ్యక్తి నుంచి భూ హక్కులను పొందుతారు. అయితే గతంలో రైతులకు రిజిష్టర్డ్ డాక్యుమెంట్లపై అవగాహన లేని సమయంలో సాదాబైనామాలు(తెల్లకాగితం)పై ఒప్పం దం చేసుకుని, భూమిని తమ స్వాధీనంలోకి తీసుకునేవారు. మోఖాపై

మిగతా 2లో



2లో

# చివరి రక్తపు బొట్టు వరకు బీసీల కోసమే

# చిగురిస్తున్న ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

భూమిని స్వాధీన పరుచుకున్నప్పటికీ.. కాగితాల్లో మాత్రం అమ్మినవారు మాత్రమే యజమానులుగా ఉండేవారు. అవగాహన ఉన్న వారు తహసీల్దార్ కార్యాలయాల్లో భూ హక్కులను కూడా బదలాయించుకునేవారు. కానీ అవగాహన లేమితో.. కొందరు రైతులు భూమిని మాత్రమే స్వాధీనపరుచుకునేవారు. హక్కుల బదలాయింపు జరిగేది కాదు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత సాదాబైనామాల ద్వారా కొంతమంది రిజిస్ట్రేషన్లు చేసుకోగా, చాలామంది అలాగే మిగిలిపోయారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న చాలామంది రైతులు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు.

**ఎల్ఆర్‌యూపీ తర్వాత ఇబ్బందులు..**

రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం ల్యాండ్ రికార్డ్ అప్డేషన్ ప్రోగ్రాం(ఎల్ఆర్‌యూపీ)ని తెచ్చింది. ఇందులో భాగంగా అన్ని రికార్డులను డిజిటలైజ్ చేయడంతోపాటు ధరణి చట్టం ద్వారా కొత్త పాసు పుస్తకాలు జారీ చేసింది. ఆ సమయంలో చాలా పొరపాట్లు జరిగాయి. భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు రావడం, ఒకరి సర్వే నెంబర్‌లోని భూమి మరొకరికి రావడం వంటివి జరిగాయి. కాస్తు కాలం ఎత్తివేయడంతో అనుభవంలో ఉన్నవారు అధికారికంగా హక్కులు కోల్పోయి, పట్టదారుల పేరుపై పాస్ బుక్కులు రావడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కాస్తుదారు కాలంలో ఉన్నవారితోపాటు, సాదాబైనామాల ద్వారా ఆస్తులు కొనుగోలు చేసిన వారు కూడా తర్వాత ఇరకాటంలో పడ్డారు. భూమి అమ్మిన వారు తిరిగి అవి తమ ఆస్తులను క్లెయిమ్ చేసి.. కోర్టులకు వెళ్లడం వంటి సమస్యలు చాలా ఉత్పన్నమయ్యాయి. అప్పటి ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి, 2014 జూన్ 2 రాష్ట్రం ఏర్పడేనాటి కంటే ముందు గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూమిని సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసి, 12 ఏళ్లు మోఖాపై ఉన్నవారికి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. 10 అక్టోబరు 2020 నుంచి 11 నవంబరు 2020 వరకు ఈ దరఖాస్తులను స్వీకరించింది. అయితే ధరణిలో మాత్రం వాటి పరిష్కారానికి ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో ఐదేళ్లుగా అటు యజమానులకు, ఇటు కాస్తుదారులకు మధ్య వివాదాలు చెలరేగుతూనే ఉన్నాయి.

**కొత్త చట్టం.. పరిష్కార మార్గం..**

ధరణి వచ్చిన తర్వాత చిన్నసన్నకారు రైతులు ఎదుర్కొన్న ప్రధాన సమస్యల్లో సాదాబైనామాలు కూడా ఒకటి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత ప్రభుత్వం నిర్దేశించిన గడువు ప్రకారం 29,375 మంది రైతులు సాదాబైమనామాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ అందుకు నోచుకోకపోవడం కూడా ధరణి పట్ల విముఖతకు, దాన్ని రద్దు చేయడానికి కారణమైందని చెప్పొచ్చు. కొత్త చట్టంలో సెక్షన్ 6, రూల్ 6 ప్రకారం సాదామైనామాలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా 2014 జూన్ 2 కంటే ముందు సాదాబైనామాల ద్వారా భూమి కొనుగోలు చేసి, 12 ఏళ్లుగా స్వాధీనంలో ఉండటంతో పాటు గత ప్రభుత్వం నిర్దేశించిన గడువులో దరఖాస్తు చేసుకున్నవారి నుంచి ఆర్డీవోలు విచారణ చేసి.. చుట్టుపక్కల రైతులతో మాట్లాడతారు. పీవోటీ, సీలింగ్, ఎల్‌టీఆర్ చట్టాల ఉల్లంఘన లేదని నిర్ధారించుకున్న తర్వాత, అర్హత ఉన్న రైతుల నుంచి ప్రస్తుత రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఆ తర్వాత హక్కుల రికార్డులో నమోదు చేసి, పాసుపుస్తకం జారీ చేస్తారు. ధరణిలో సాదాబైనామాల కోసం నిబంధన లేనందున హైకోర్టు వీటి క్రమబద్ధీకరణపై గతంలో స్టే విధించింది.

# చివరి రక్తపు బొట్టు వరకు బీసీల కోసమే

**ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాగర్‌కర్నూల్‌లో బీసీ జన చైతన్య సభ**



**నాగర్‌కర్నూల్ టౌన్, ప్రజా జ్యోతి న్యూస్ ప్రతినిధి :** పదవులపై ఎప్పుడూ ఆశ పె ట్టుకోలేదని, తన చివరి రక్తపు బొట్టు వరకు బీసీల కోసమేనని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఇక ముందు ఎట్టి పరిస్థితిల్లోనూ అగ్రకుల పార్టీలకు సేవ చేసేది లేదని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తీగల వెంకటస్వామి కన్వెన్షన్ హాలులో, బీసీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ జన చైతన్య సభ నిర్వహించారు. పూలే ట్రస్టు వ్యవస్థాపకుడు పచ్చిపాల సుబ్బయ్య అధ్య క్షతన నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిథి గా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, అతిథులుగా బీసీ జన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్‌యాదవ్, విశ్రాంత డీఈవో ప్రొఫెసర్ శివార్చక విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం మొత్తం పంచాయతీ మొదలైందని, అగ్రకుల నాయకుల గోత్రం, పుట్టు పూర్వోత్తరాలతో సహా తాను బయటపెట్టాన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వే షన్లు అమలు చేసే వరకు ఉద్యోగాలకు నోటి ఫికేషన్లు వేయొద్దని, కాదని ఉద్యోగాల భర్తీకి పోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుర్చీ వచ్చే ఎన్నికల దాకా ఉండదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలనా అనుభవం లేద ని, కేవలం మోసం, దగా, వంచనలో అనుభవం ఉందని విమర్శించారు. సీఎంకు ఉన్న లలితకళలను ఉపయోగించి తప్పుడు కులగణనతో బీసీలను తక్కువగా చూపించారని ఆరో పించారు. బీసీలంటే తక్కువ కాదని, బీసీలం టే బిగ్గెస్ట్ క్లాస్ అన్నారు. బీసీ కులాలన్నీ ఒక్క టై మన కుర్చీలను మనం తీసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం అసిస్టెంట్ ప్రొఫె సర్ డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్ బీసీ డిక్లరే షన్‌ను ప్రవేశపెట్టారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్ల న్న చేతుల మీదుగా బీసీ రచ్చబండ పోస్టర్ ను ఆవిష్కరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుంకర రమాదేవి రాసిన భారత రాజ్యాంగ పుస్తకాలను విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సుదగాని హరిశంకర్‌గౌడ్, రాష్ట్ర స మన్వయకర్త వట్టె జానయ్యయాదవ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు బైకని శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగనమోని కిరణ్, బహుజన టీచర్స్ అసోసియే షన్ జిల్లా అధ్యక్షుడు చీర్ల భాస్కర్, బీసీ సం క్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, గెస్టు లెక్చరర్స్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సదానందంగౌడ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు లాలుయాదవ్, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధా న కార్యదర్శి కోళ్ల శివ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్, అసెంబ్లీ ఇన్‌చార్జి కొ త్తపల్లి కుమార్, డీటీయూ జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి నిరంజన్, మత్స్యశాఖ జిల్లా అధ్య క్షుడు వాకిటి ఆంజనేయులు, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు ఓర్సు బంగారయ్య, తీన్మార్ మల్లన్న టీం పరశురాం, శివ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం కోసం ఆత్మ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)



వట్పల్లి, మునిపల్లి మండలాల అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంత అభివృద్ధి చెందాలంటే రోడ్డు రవాణా సౌకర్యాలు మెరుగుపడాలని అందుకోసం ప్రత్యేక శ్రద్ధతో నియోజకవర్గ పరిధిలోని రోడ్లకు మరమ్మత్తులు చేపట్టడంతో పాటు నూతన రోడ్ల ఏర్పాటుకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వైద్య సౌకర్యాలు మెరుగు కోసం వట్పల్లిలో రూ 15 కోట్లతో ఏరియా ఆసుపత్రి నిర్మాణం అల్లాపూర్ సింగీతం గ్రామాలలో నూతనంగా ఒక్కొక్కటి ఐదు కోట్ల తో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం పడలు చురుగ్గా సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. 4.50 కోట్ల తో చేపట్టిన కప్పాడు, రాయికోడు, 4.4 కిలోమీటర్ల మేర బి టి రోడ్డు మరమ్మత్తు పనులు చురుగ్గా సాగుతున్నాయని, త్వరలో పనులు పూర్తయి రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి అన్నారు. దీంతో పాటు నియోజకవర్గ పరిధిలోని వట్టిపల్లి మరవెల్లి, రాయికోడ్ తదితర ప్రాంతాలకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ద్వారా సాగునీరు అందించేందుకు కోసం అంచనాలు రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఆత్మ కమిటీ సభ్యులు రైతుల మనసు లో స్థానం పొందేలా రైతులకు అధునాతన పద్ధతులపై తరచూ శిక్షణలు కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ప్రతినెల రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయడం కమిటీ సమావేశాలు నిర్వహించడం అన్ని మండలాలలో రైతులకు అధునాతన పద్ధతులపై అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి కమిటీ సభ్యులకు చైర్మన్కు సూచించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి 15 నెలల కాలం కావస్తుందని 15 నెలల కాలంలో రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువకుల కోసం రాజీవ్ యువ వికాసం యొక్క పథకం చేపట్టిందన్నారు. ఈ పథకం కోసం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నిరుద్యోగ యువకులు అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. గతంలో రేషన్ దుకాణాలలో వచ్చే బియ్యాన్ని ఎవరు తినేవారు కారని తిరిగి దళారులకు కానీ ఇప్పుడు సన్న బియ్యం కోసం క్యూ లైన్ లో నిలబడి ప్రజలు కొనుగోలు చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నాలాచెరు కచూర్ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ఆర్డీవో రామిరెడ్డి , ఎ డి ఎ సత్యనారాయణ, ఎంపీడీవో షరీఫ్, ప్రజా ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.



## కనక వస్త్ర సిల్క్స్ షోరూంను ప్రారంభించిన ఐశ్వర్య రాజేశ్

**జూబ్లీహిల్స్,ఏప్రిల్18(ప్రజాజ్యోతి) :** కనక వస్త్ర సిల్క్స్ తమ మొదటి షోరూమ్‌ను సంక్రాంతి మూవీ ఫేమ్ ఐశ్వర్య రాజేశ్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఏ ఏ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కనక వస్త్ర సిల్క్ షోరూమ్ లో ఖచ్చితమైన కాంచీపురం పట్టు చీరలు మరియు ఇతర వెరైటీలు లభిస్తున్నాయన్నారు. అనంతరం ఐశ్వర్య రాజేశ్ మాట్లాడుతూ ఇక్కడ కలెక్షన్స్ నా బాగా నచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో కనక వస్త్ర సిల్క్స్ నిర్వహకులు పోతంశెట్టి శ్రీనివాసులు, డైరెక్టర్ మాతురి పవన్ కుమార్, డైరెక్టర్ జున్నా రోహిత్ రెడ్డి, డైరెక్టర్ బి. నాగశ్రీ రెడ్డి, జున్నా శేఖర్ రెడ్డి, జున్నా సోలార్స్ , కొనిజేటి వెంకటేశ్వర గుప్తా, ఫ్లో జెన్ హైడ్రో ఎనర్జీ లిమిటెడ్, కొనిజేటి మల్లికార్జున ప్రసాద్, క్రియా జ్యూవెల్లర్స్ , వి. విజయ్ కుమార్, విజన్ వీవీకే హౌసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత దేశ రాజ్యాంగాన్ని కాపాడాలి: ముస్లిం యాక్షన్ కమిటీ. తాహెర్ అలీ.



**కల్హేర్. 18. ఏప్రిల్ టప్రజా జ్యోతి:** సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ మైనారిటీ వర్కింగ్ మెంబర్. ముస్లిం యాక్షన్ కమిటీ నాయకుడు తాహెర అలీ మాట్లాడుతూ అన్ని వర్గాల కోసం భారత రాజ్యాంగ నిర్మాత మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు రూపొందించిన రాజ్యాంగాన్ని కాపాడాల్సిన అవసరం వచ్చిందని ముస్లిం యాక్షన్ కమిటీ నాయకులు తాహెర్ అలీ డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణఖేడ్ తహసీల్ మైదానంలో వక్ఫ్ బోర్డు నూతన చట్టానికి వ్యతిరేకంగా నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. వెంటనే నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లిం పర్సనల్ లోని షరియత్ లో కలగజేసుకొని మూడు తలాకుల బిల్లును ప్రతిపాదించిన కేంద్ర ప్రభుత్వం. రోహింగ్యాల పేరు చెప్పుకొని ఎన్ ఆర్ సి చట్టాన్ని తెచ్చిన కేంద్ర ప్రభుత్వం. మహాత్ముడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన ఓటు హక్కును లేకుండా చేయడమే బిజెపి యొక్క లక్ష్యంగా ముందుకు సాగుతుందని. రాజ్యాంగంలో మతప్రత్యపాదికపై అందరికీ జీవించే హక్కు మతాన్ని అనుభవించకు హక్కు. లౌకిక వాదానికి మారుపేర టృన భారతదేశంలో ఐక్యతను చిన్నభిన్నం చేయడమే ముఖ్య ఉద్దేశం అని. బ్రిటిష్ వారితో మొట్టమొదటి బలిదానం చేసిన ముస్లిం నాయకులను మరిచి మాట్లాడుతుందని భారతదేశంలో ఐక్యమత్యంగా కలిసి బ్రిటిష్ వారితో పోరాడిన షోయబుల్లాఖాన్ వంటి మహా నాయకులకు మరచి కక్ష సాధింపులకు పాల్పడుతుందని తెలిపారు. నిర్వహించిన సభకు ముస్లిం నాయకులు వక్తలు న్యాయవాదులు డాక్టర్లు ఉన్నత వర్గ శ్రేణి విద్యాన్సులు ప్రజలు భారీగా పాల్గొని సభను విజయవంతం చేసినందుకు అందరికీ ధన్యవాదములు అని తెలిపారు

# తెలంగాణ గిరిజన సహకార సంస్థ ఊతం.. గిరి నేచర్

### పోషక మిల్లెట్ స్నాక్స్ ఆవిష్కరణ



**బంజారాహిల్స్,ఏప్రిల్18(ప్రజాజ్యోతి)** తెలంగాణ గిరిజన సహకార సంస్థ లిమిటెడ్ (టీజీజీసీసీ) గిరి నేచర్ బ్రాండ్‌తో తేనె మిల్లెట్ కుకీస్, తేనె చిక్కీలను ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. శరత్, న్యూట్రిహబ్ ఐసీఏఆర్, ఐఐఎంఆర్ సీఈఓ, డైరెక్టర్ డాక్టర్ బి. దయాకర్ రావు పాల్గొన్నారు. చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణకే కాకుండా గిరిజనుల జీవనోపాధికి ఈ మిల్లెట్ ఆధారిత కుకీలు, చిక్కీలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గిరిజన రైతులు, తయారీదారులకు మార్కెట్ అవకాశాలు కల్పించి, వారి ఉత్పత్తులు సమాజానికి ఉపయోగపడేలా వినియోగించేందుకు మార్గం సిద్ధమవుతోంది. గిరిజన సముదాయాన్ని ఆర్థికంగా, సామాజికంగా బలపరిచే దిశగా తీసుకున్న ఓ ముఖ్యమైన అడుగని ఈ కార్యక్రమాన్ని చెప్పుకోవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి ఎం. భట్టి విక్రమార్క, మహిళా, శిశు సంక్షేమ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, టీజీజీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి ఈ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు పలికారు. ఈ సందర్భంగా కొట్నాక్ తిరుపతి మాట్లాడుతూ, "తెలంగాణలోని పిల్లలకు, యువతకు ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యత గల చిరుతిళ్లు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పిల్లలు మన దేశ భవిష్యత్తుకు మూలస్తంభాలు. తీసుకునే ఆహారం, చేసే వ్యాయామంపై వారి ఆరోగ్యం ముడిపడి ఉంటుంది. పేగుల ఆరోగ్యాన్ని కాపాడే, శారీరక ధృఢత్వాన్ని పెంపొందించే ఆహారం చిన్నారులకు అవసరం. సమతుల ఆహారంతో పాటు, విటమిన్లు, ఖనిజాలు అందించే రుచికరమైన, పోషకమైన స్నాక్స్ వారికి అందుబాటులో ఉండాలి. ఇది వారి సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుంది" అని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. శరత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. అడవుల్లో గిరిజన సంఘాలు సేకరించిన స్వచ్ఛమైన తేనెతో తయారైన మిల్లెట్ కుకీస్, చిక్కీలను అందిస్తోంది. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు, సమాజ సంక్షేమానికి తోడ్పడటం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. న్యూట్రీహబ్, సీఏఆర్, ఐఐఎంఆర్ సీఈఓ, డైరెక్టర్ డాక్టర్ బి. దయాకర్ రావు ఆధ్వర్యంలో జరిగిన లోతైన పరిశోధన, నిపుణుల పరిశీలన ఫలితంగా ఈ ఉత్పత్తులు రూపుదిద్దుకున్నాయి. మిల్లెట్లను అడవుల్లోనుంచి సేకరించిన స్వచ్ఛమైన తేనెతో కలిపి మిల్లెట్ న్యూట్రి చిక్కీ, హనీ మిల్లెట్ కుకీలు తయారు చేస్తున్నారు. ఇవి ఆరోగ్యానికి ఎంతో మంచివని నిపుణులు చెబుతున్నారు.

# కీర్తిపల్లి రాజుకు అంతర్జాతీయ పదవి



– నమో మిషన్ వందే గౌమాతరం – యూఎస్ఏ ఎంపవర్‌మెంట్ వింగ్ అధ్యక్షుడిగా నియామకం ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నమో మిషన్ వందే గౌమాతరం సంస్థలో తెలంగాణకు చెందిన కీర్తిపల్లి రాజు, యూఎస్ఏ ఎంపవర్‌మెంట్ వింగ్‌కు వ్యవస్థాపక సభ్యుడు మరియు అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నమో మిషన్ వందే గౌమాతరం సంస్థ విడుదల చేసిన ఒక అధికారిక ప్రకటనలో రాజు ఈ పదవికి ఎంపిక కావడం వెనుక ఆయన యొక్క నాయకత్వ నైపుణ్యాలు, వ్యూహాత్మక దృష్టికోణం, మరియు సామాజిక సేవ పట్ల ఉన్న అపారమైన నిబద్ధత ప్రధాన కారణాలుగా నిలిచాయని ,ఆయన నాయకత్వంలో, ఎంపవర్‌మెంట్ వింగ్ యూఎస్ఏలో మరియు అంతర్జాతీయ స్థాయిలో మరింత బలోపేతం కానుందని పేర్కొంది. నమో మిషన్ వందే గౌమాతరం వ్యవస్థాపకురాలు వీర మద్విరాజ్ సీపెపెలి మాట్లాడుతూ, మంచి నాయకత్వ బృందంలో రాజును స్వాగతించడం మాకు గర్వకారణమని, ఆయన అభివృద్ధి పట్ల చూపుతున్న నిబద్ధత, సాధనల పట్ల ఆసక్తి సంస్థ లక్ష్యాలను సాధించడంలో ఎంతో తోడ్పడుతాయని మేము విశ్వసిస్తున్నామని అన్నారు. యూఎస్ఏ లో వివిధ సామాజిక, ఆర్థిక రంగాల్లో శక్తివంతమైన అభివృద్ధి వ్యూహాలను అమలు చేయడానికి, సంస్థ లక్ష్యాలను ప్రజల లోతుల్లోకి తీసుకెళ్లేందుకు రాజు కృషి చేయనున్నారు. ప్రత్యేకంగా వంచిత వర్గాల శక్తివంతీకరణకు ఆయన ప్రత్యేక దృష్టి సారించనున్నారు.ద నమో మిషన్ వందే గౌమాతరం సంస్థ సామాజిక సేవకు అంకితమైన స్వచ్ఛంద సంస్థ.ఇది సమాజ శ్రేయస్సు కోసం క్రియాశీల కార్యక్రమాలను చేపడుతూ, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, మరియు గో సంరక్షణ రంగాల్లో విశేష కృషి చేస్తోంది. గోవులకు ఆశ్రయం కల్పించటం, వైద్యసేవలు అందించడం, గో ఉత్పత్తుల ప్రోత్సాహం. ఎంపవర్‌మెంట్ వింగ్ విభాగం విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల ద్వారా వంచిత వర్గాలకు శక్తినిచ్చే కార్యక్రమాలు పర్యవేక్షిస్తుంది. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలు, పునఃవినియోగ విధానాలపై అవగాహన కల్పిస్తుంది. కీర్తిపల్లి రాజు నియామకం, తెలంగాణలోని మేధావుల కృషికి అంతర్జాతీయ గుర్తింపు లభించడమేకాక రాష్ట్రానికి గర్వకారణం. తెలంగాణ యువతకు ఒక ఆదర్శంగా నిలుస్తుంది.

## ఉపాధి కూలీల వేతనం రూ.600 పెంచాలి: రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు . నర్సింలు

**కల్హేర్. 18. ఏప్రిల్ ట ప్రజా జ్యోతి :** సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ నియోజకవర్గం అన్ని మండల కేంద్రాలలో గ్రామాలలో జాతీయ ఉపాధి హామీ పథకం పై మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీల వేతనం రూ.600లకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింలు అన్నారు. ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఉపాధి హామీ పని ప్రదేశంలో నీటి సదుపాయం, టెంట్, మెడికల్ కిట్ సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీ వేతనం పెంచాలన్నారు. ఏరియా కార్యదర్శి రమేష్, నితిన్ పాల్గొన్నారు.






# వనస్థలిపురం పోలీస్ స్టేషన్ లో రాచకొండ సిపి ఆకస్మిక తనిఖీ

**ప్రజా జ్యోతి ఎల్బీనగర్ ప్రతినిధి:** రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసు స్టేషన్లలో అధికారులు మరియు సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి కమిషనర్ సుధీర్ బాబు ఐపిఎస్ శుక్రవారం నాడు వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

# ఆపదలోను వెల్లివిరిసిన స్నేహం

**యాచారం, ఏప్రిల్ 18 (ప్రజాజ్యోతి):** ఆపదలోనున్న స్నేహితునికి ఆపన్న హస్తం అందించడంతో తమ స్నేహంలో ఆత్మీయత వెల్లివెరిసింది. కష్టంలో వెన్నంటే ఉండి ఆపదలో మేమున్నాం అంటూ ధైర్యం చెబుతూనే అనారోగ్యంతో ఉన్న స్నేహితునికి తమ స్నేహం అండగా నిలిచింది. మండల పరిధిలోని చింతుల్లకు చెందిన జక్కుల రవీందర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న చింతుల్ల జడ్పీ హై స్కూల్ 2004 2005 ఎస్ఎస్సికి చెందిన పూర్వ స్నేహితులంతా అనారోగ్యంతోనున్న రవీందర్ కు ఎలాగైనా తమ వంతు సాయం అందించాలని సంకల్పించారు. వారంతా కలిసి రూ. 83 వేలు పోగు చేశారు. శుక్రవారం వారంతా రవీందర్ ను పరామర్శించి తన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పోగుచేసిన రూ. 83 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తాము అందజేసిన ఆర్థిక సాయంతో రవీందర్ అనారోగ్య పరిస్థితి మెరుగుపడాలని వారంతా ఆకాంక్షించారు. ఆపదకు భరోసా, ధైర్యం ఇచ్చేది, భుజం తట్టి అండగా నిలిచేది స్నేహమేనని స్నేహితులంతా పేర్కొన్నారు. అనారోగ్య పరిస్థితులలోనూ అండగా నిలిచిన స్నేహితులందరికీ రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రపంచ వారసత్వ దినోత్సవం-25 సందర్భంగా 'హైదరాబాద్ హెరిటేజ్ వాక్'

**నిర్వహించిన డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్**




**హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి) :** వారసత్వ సంరక్షణ అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది మన సమాజపు కలిసికట్టు బాధ్యతగా భావించాలని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ సూచించారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం(ఇంటర్నేషనల్ డే ఫర్ మోనుమెంట్స్ అండ్ సైట్స్) సందర్భంగా శుక్రవారం డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పురావస్తు శాఖ(ఏఎస్ఐ) హైదరాబాద్ సర్కిల్, తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ(టీఎస్ టీడీసీ), జేబీఆర్ ఏసీ, ఫోరమ్ ఫర్ ఏ బెటర్ హైదరాబాద్, ఇతర పౌర సంఘాల భాగస్వామ్యంతో హెరిటేజ్ వాక్ వేదకుమార్ అధ్యక్షతన చార్మినార్ వద్ద ప్రారంభించారు. ప్రొఫెసర్ జి.ఎస్.వి.సూర్యనారాయణ మూర్తి, సౌత్ జోన్ రిప్రెసెంటేటివ్, ఐకామోస్ ఇండియా, డా.జి.జయశ్రీ, ప్రాచీన భారత చరిత్ర, పురావస్తు శాఖ, ఉస్మానియా యూనివర్సిటీ, కోటయ్య వింజమూరి, డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్ట్, ఏఎస్ఐ డా.ఈ.సాయికృష్ణ, అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట్, ఏఎస్ఐ, జె.రాజేశ్వరి, కన్సర్వేషనిస్ట్, ఏఎస్ఐ, సాయి రామ్, సుధాకర్, కార్యనిర్వాహకులు, తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎస్.ప్రభాకర్, డీటీఓ, పర్యాటక శాఖ, డి.శ్రీనివాస్, హెరిటేజ్ వాక్ ఇన్‌చార్జ్, డి.శ్యాం సుందర్ రావు, స్థపతి, డా.ద్యావనపల్లి సత్యనారాయణ, క్యురేటర్, తెలంగాణ గిరిజన మ్యూజియం, పి.వీరమల్లు, అధ్యక్షుడు, బౌద్ధ తత్వ ఫౌండేషన్, సిటీ కాలేజ్, జేబిఏఆర్ సీ, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, ఎస్ఆర్డీపి, వాసవి స్కూల్, వైష్ణవి ఆర్కిటెక్చర్ కాలేజ్ విద్యార్థులు, పౌర సంఘాల సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# భారత రాజ్యాంగ మూల సూత్రాన్ని మార్చాలని కోవడం అవివేకం

**కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్**




**కూకట్ పల్లి, ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి) :** భారత రాజ్యాంగ మూలసూత్రాన్ని మార్చాలనుకోవడం అవివేకమని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ధ్వజమెత్తారు. ఏ ఐ సి సి పిలుపుమేరకు జైబాపు జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమం కూకట్ పల్లి నియోజకవర్గంలో ఉధృతంగా కొనసాగుతుంది. శుక్రవారం మూసాపేట డివిజన్ పాండురంగ నగర్ లో ఇన్చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కోఆర్డినేటర్ ఇంచార్జ్ ఉజ్మాషకీరా మాట్లాడుతూ భారతదేశ ఆత్మ రాజ్యాంగం అని దాన్ని మార్చాలనుకోవడం భాజపా స్వార్థ ప్రయోజనాల కోసమే నని ధ్వజమెత్తారు. రమేష్ మాట్లాడుతూ 140 కోట్ల భారత ప్రజల ప్రతీక అని దాని మార్పును కాంగ్రెస్ పార్టీ అంగీకరించబోద న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు జై భీమ్ జై సంవిధాన్ కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా పార్టీ కార్యకర్తలు ఐకమత్యంగా కొనసాగుతూ విజయవంతం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్ ,బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస యు ఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అబ్దుల్లాపూర్ మెట్ లో ఘనంగా ఎస్.ఆర్ గ్యాస్ ఏజెన్సీ ప్రారంభోత్సవం



**అబ్దుల్లాపూర్ మెట్టు ఏప్రిల్ 18(ప్రజా జ్యోతి)** అబ్దుల్లాపూర్ మెట్ మండలం విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం రామోజీ ఫిలిం సిటీ ఎదురుగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పక్కన నిర్వాహకులు ముత్తడి శ్రీకాంత్ రెడ్డి,విడిజల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎస్.ఆర్ గ్యాస్ ఏజెన్సీని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తనయుడు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ ఇండస్ట్రియల్ అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ గ్యాస్ ఏజెన్సీ చుట్టుపక్కల కంపెనీలు ఆసుపత్రుల వినియోగదారులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఏజెన్సీ నిర్వాహకులు మాట్లాడుతూ తమ వద్ద మెడికల్ ఇండస్ట్రియల్ అవసరాలకు సంబంధించిన ఆక్సిజన్, నైట్రోజన్, ఆర్గాన్, బిఏ,కార్బన్ డయాక్సైడ్, అమోనియా, స్పెషల్ గ్రేడ్ గ్యాస్‌లు, ఎల్పీజీ తదితర గ్యాస్‌లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్మెట్ పరిసర ప్రాంతాల వినియోగదారుల సౌకర్యార్థం ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఈ గ్యాస్ ఏజెన్సీని అబ్దుల్లాపూర మెట్ లో ప్రారంభించడం తమకు చాలా సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాటసింగారం రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్టు మండలం తాజా మాజీ జెడ్పిటిసి బింగి దేవదాస్ గౌడ్, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్. భాస్కరా చారి.తాజా మాజీ మండల ఎంపీపీ బుర్రరేఖ మహేందర్ గౌడ్.పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ తాజా మాజీ కౌన్సిలర్లు మాజీ వైస్ చైర్మన్ సిద్దంకి కిష్టారెడ్డి,బోర్ర అనురాధ సురేష్, విద్యవిజయేందర్ రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు పండుగల నాగార్జున, చెరుకూరి జగన్, తదితరులు పాల్గొన్నారు.



మధుయాష్కి గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న షబ్బీర్ అలీ

అబ్దుల్లాపూర్ మెట్టు ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి) : టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యులు మధుయాష్కి గౌడ్ ను శుక్రవారం ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబీర్ అలీ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

## బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ చేతుల మీదుగా "దళిత రత్న" అవార్డుల ప్రధానం.



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 18(ప్రజా జ్యోతి): దళితుల అభ్యున్నతి కోసం చేసిన కృషికి గాను తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్ కులాల అభివృద్ధి సమస్త ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ప్రధానం చేసే "దళిత రత్న" అవార్డులకు ఎంపికైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు సామాజిక కార్యకర్తలకు గురువారం సాయంత్రం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అవార్డులను ప్రధానం చేశారు. ఈ ప్రధానోత్సవ కార్యక్రమంలో సబ్ డివిజన్ అట్రాసిటీ (పి. ఓ. ఎ) మానిటరింగ్ కమిటీ మెంబర్ మేకల నాగేష్, దళిత రత్న అవార్డులకు గ్రహీతలు డప్పు రామస్వామి, జోగు వెంకట్, బండ మహేందర్, అమృతయ్య, యు.అబ్రహం, కె.నాగులు, ఉప్పలయ్య, యేసు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డ్ బిల్లుకు వ్యతిరేకంగా ఖేడ్ లో భారీ ర్యాలీ

కల్హేర్. /నారాయణఖేడ్.. 18.ఏప్రిల్.ట ప్రజా జ్యోతి : వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని రాజీవ్ చౌక్ నుండి తహశీల్దార్ మైదానం వరకు ముస్లింలు శాంతియుత%శీ%గా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ..మైనార్టీ హక్కులకు ముప్పుగా భావించే వక్ఫ్ బోర్డు బిల్లుకు ప్రతిపాదిత సవరణలకు వ్యతిరేకంగా ఈ నిరసన చేపడుతున్నామని తెలిపారు. ఈ సవరణలు ముస్లింలకు మాత్రమే కాకుండా ఇతర మైనారిటీ వర్గాలను కూడా ప్రభావితం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం సొంత నిర్ణయాలు తీసుకుని ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. బోర్డు నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని లేనియెడల ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాహెర్ అలీ, మైనోద్దీన్ ఖురేషి, యునూస్, అజీమ్ ఖురేషి, ముంతాజ్, నజీబ్, బసీద్, మోహిత్ పటేల్, సయ్యద్ నుమాన్, గౌస్ చిస్తీ, వాజీద్, బాబా, అజ్జు, నబి, ఉమెర్, జుబేర్, ఆర్షద్, షబ్బీర్ సాబ్, సుబూర్, ఫైయాజ్ పాల్గొన్నారు.




# కురుమ సంక్షేమ భవనానికి కృషి చేస్తా

**- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**- కురుమ సంఘం భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యాదయ్య, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం**





చేవెళ్ల ఏప్రిల్ 18(ప్రజా జ్యోతి): చేవెళ్లలో కురుమ సంక్షేమ భవనానికి కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో దేవుని ఎర్రవల్లి గ్రామ కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతన కురుమ సంఘం భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు చింపుల సత్యనారాయణ పాల్గొని స్థానిక కురుమ సంఘం నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కురుమల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో కురుమల సంక్షేమ భవనానికి స్థలాన్ని కేటాయిస్తానని భవన నిర్మాణానికి 25 లక్షలు ఇస్తానని ఎమ్మెల్యే హామీ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ.. కురుమలు రాజకీయంగా అధికంగా ఎదగాలన్నారు. కురుమ సంఘ భవనానికి తన వంతు 25 లక్షలు ఇస్తానని అన్నారు. అలాగే రానున స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని వర్గాలను కలుపుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేష్, దేశమొల్ల ఆంజనేయులు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎదిరే రాములు, బిజెపి మండల అధ్యక్షుడు అత్తెలి అనంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్ రెడ్డి, రాష్ట్ర ధార్మిక పరిషత్ సభ్యులు కేశపల్లి వెంకట్ రామ్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు కరికే సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రాజు, కరికే శ్రీను, ఎదిరే బక్కయ్య, చంద్రయ్య, మాజీ సర్పంచ్ శ్యామలయ్య, ఎదిరే మాణిక్యం, కంకంటి శ్రీశైలం, ఎదిరే మల్లేష్, చీర శ్రీనివాస్ యాదవ్, కుమార్, పత్తి సత్యనారాయణ, బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు సామ మాణిక్య రెడ్డి, కురుమ సంఘం మండల అధ్యక్షుడు కసిరే వెంకటేష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్, మల్లేష్, శ్రీపాల్ దండు సత్యం గుత్తి మల్లేష్, గుండాల రాములు, సామ కృష్ణారెడ్డి, పాండు యాదవ్, మిట్టి మాణిక్య రెడ్డి, సామ రంగారెడ్డి, కృష్ణ గౌడ్, కృష్ణమోహన్, చీర రమేష్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి అరుణ్ కుమార్, కురుమ సంఘం నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు ఘనంగా సన్మానం



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 18(ప్రజా జ్యోతి): ఎంతో ఘన చరిత్ర గల పుల్లాస్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సన్మాన సభ ఆద్యాంతం ఆహ్లాదకరంగా సాగింది. గత 30 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం మొన్న ఏప్రిల్ 14న తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ చేస్తున్నట్లు గజిట్లో చేర్చిన సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన పుల్లాస్ ఫ్యామిలీ పద్మశ్రీ మందకృష్ణ మాదిగను ఘనంగా సత్కరించారు, అదేవిధంగా లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమాన్ని వెన్నంటి ఉండి అహర్నిశలు కష్టపడి ముందుకు నడిపించిన ఉద్యమ నాయకులు కళా నేతలు, పృథ్వీరాజ్ యాదవ్,తెలంగాణ విట్టల్, ఇస్మాయిల్ బాయ్, వరంగల్ శ్రీనివాస్, ఏపూరి సోమన్న, మిట్టపల్లి సురేందర్,దరువు అంజన్న, దరువు ఎల్లన్న, అంతర్గుల నాగరాజు, వరంగల్ రవి,రామంచ భరత్. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ తదితరులను పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తన చేతుల మీదుగా సత్కరించారు. సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ రేపటి తరంకై మనం పోరాడాల్సిన అవసరం ఉందని రాబోయే రోజుల్లో రాజ్యాధికారం మనదేనని అన్నారు. ఈ సభకు ప్రొఫెసర్ పుల్లా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.

## రాయికోడ్ లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



సంగారెడ్డి, ఏప్రిల్ 18 , ప్రజా జ్యోతి న్యూస్ ప్రతినిధి : రాయి కోడ్ మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువగా జొన్నలు రవి సీజన్లో సాగు చేస్తారని జొన్నలకు ప్రభుత్వం మద్దతు ధర అందించడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.3371 కి కొనుగోలు కేంద్రాలలో జొన్నలను కొనుగోలు చేయునట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాంత రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వము ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తమ జొన్నలను విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నాలాచెరు కచూర్ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ఆర్డీవో రామిరెడ్డి , ఎ డి ఎ సత్యనారాయణ, ఎంపీడీవో షరీఫ్, ప్రజా ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.



# రైతులు పంట మార్పిడి పద్ధతులు పాటించాలి

**- కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థులు**

**చేవెళ్ల ఏప్రిల్ 18(ప్రజా జ్యోతి):** రైతులు పంట మార్పిడి పద్ధతులను ఉపయోగించాలని ఆచార్య కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ (మోజర్ల) విద్యార్థులు తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని కందావాడలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై పంట మార్పిడి వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఒకే రకమైన పంటలను దీర్ఘకాలం పాటు సాగు చేయడం వల్ల పంటలను చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని తెలిపారు. పంట మార్పిడి వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. ఉద్యాన విద్యార్థులు స్వాతి, ప్రీతి, అఖిల, లావణ్య, శారద, సంతోష, సానియా తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అదృశ్యం

**కుడల్ల బాలమణి తన కూతురు కనబడుటలేదని కేశంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**

**కేశంపేట ఏప్రిల్ 18 ( ప్రజా జ్యోతి) :** ఎస్సై రాజకుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి కేశంపేట మండల పరిధిలోని సంగం గ్రామానికి చెందిన కూడల్ల బాలమణి భర్త బిక్షపతి కి నలుగురు కూతుర్లు రెండో అమ్మాయి అయినా స్పందనను ఏ క్లాస్ కాన్ పేట గ్రామానికి చెందిన బట్టు నరేష్ తో వివాహం జరిగింది స్పందనకు ఇద్దరు కుమారులు ఉన్నట్లు తల్లి బాలమణి తెలిపారు అని తెలిపారు అత్తగారి ఇంటిలో గొడవపడి 17 తారీకు సాయంత్రం 4 30 గంటల ప్రాంతంలో తన ఇద్దరు కుమారులను ఇంటిలో వదిలిపెట్టి వెళ్ళిపోయిందని ఎంత వెతికిన చుట్టుప్రక్కల వాళ్ళని వారి బంధువులని అడిగి తెలుసుకున్న ఫలితం లేకపోవడంతో తల్లి బాలమణి కేశంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు



# రజతోత్సవాలకు భారీగా తరలివెళ్దాం...ఐకమత్యాన్ని చాటుదాం



**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 18(ప్రజా జ్యోతి):** నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ కార్యాలయంలో వారి ఆధ్వర్యంలో రజతోత్సవ వేడుకలు, భారీ సభ విజయవంతం చేయటానికి బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ లో 27-04-2025 బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభకు కలిసి కట్టుగా బయల్దేరి మన ఐక్యతను చాటుదాం అని తెలంగాణ రాష్ట్ర సాధనకై పుట్టి, రాష్ట్రాన్ని సాధించిన పది సంవత్సరాల లోపే బంగారు మయంగా మార్చిన ఘనత బిఆర్ఎస్ కే దక్కిందన్నారు. ఇంతటి ఘన కీర్తి దక్కించుకున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేళ కలిసి కట్టుగా బయల్దేరి వెళ్దాం...ఐక్యతను చాటుదామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కాసాని సుధాకర్, ఆగం రాజు,రవి కిరణ్, బాలాజీ నాయక్, రాఘవేంద్ర రావు, పెద్ది రెడ్డి సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, ఎన్ఎంసి యువజన విభాగ అధ్యక్షులు ప్రవీణ్, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, యువజన విభాగ నాయకులు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# శాంతినగర్ కాలనీ కృపా నిరీక్షణ మినిస్ట్రీస్ లో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**అబ్దుల్లాపూర్ మెట్టు ఏప్రిల్ 18 (ప్రజా జ్యోతి):** పెద్ద అంబర్ పేట్ 4వ వార్డు పరిధి శాంతినగర్ కాలనీలోని కృపా నిరీక్షణ మినిస్ట్రీస్ లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన నిర్వహించారు. క్రీస్తు మరణాన్ని గుర్తు చేసుకుంటూ చర్చిలో ప్రార్థనలతో గంటలు మోగించారు.సంఘ సభ్యులు ఏసుక్రీస్తు కల్వరి సిలువలో పలికిన ఏడు మాటలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పాస్టర్ సిల్వధర్ గుడ్ ఫ్రైడే విశిష్టతను వివరించారు. పాస్టర్ సిల్వధర్ మాట్లాడుతూ మానవుల పాప విముక్తి కోసం ఏసుక్రీస్తు కల్వరి సిలువలో రక్తం కార్చి మృతి చెందారన్నారు. లోకంలో ఎవరూ చేయని త్యాగాన్ని ఆయన చేశారన్నారు. ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలు క్రైస్తవ మార్గంలో నడుస్తున్న వారికి ఎన్నో ఆధ్యాత్మిక సత్యాలను నేర్పిస్తాయని పాస్టర్ సిల్వధర్ అన్నారు. ప్రతి ఒక్కరూ సత్య మార్గాన్ని అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మనిషి చనిపోయేంత వరకు ఏసుప్రభువు బోధనలను స్మరించుకుంటూ సమాజానికి, ప్రజలకు ఎలా ఉపయోగకరంగా ఉండాలో పాస్టర్ సిల్వధర్ తెలియజేశారు. ప్రతి ఒక్కరి పట్ల ప్రేమ, కరుణ, సాదరభావం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలని ఆయన అన్నారు. ప్రార్థనల అనంతరం క్రైస్తవ సోదర, సోదరీమణులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు, యూత్ సభ్యులు, మహిళలు, పిల్లలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు పండ్ల పంపిణీ

**- గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు**



**తాండూర్ ఏప్రిల్ 18 ప్రజాజ్యోతి:** లోక రక్షకుడు ఏసుక్రీస్తు ప్రభువారు 2025 సంవత్సరాలకు పూర్వం ఈ లోకంలో జన్మించి 33 సంవత్సరాలు ప్రజల మధ్య జీవించి నేడు శుభ శుక్రవారం రోజు సిలువపై రక్తం చిందించి ప్రాణాలు విడిచిన ఈరోజును ఎంతో పవిత్రమైనదిగి క్రైస్తవ సమాజం భావిస్తుందని ఏసు పరిచర్యలు సరైన మార్గం సంఘ కాపరి కత్తి విక్టర్ మోజస్ పేర్కొన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండడమే కాకుండా ఆర్టీసీ ఉద్యోగులు చేసే ప్రయాణ సౌకర్యం అంతటిలో కూడా దేవుని కృప ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ వారి ఆరోగ్య విషయంలో కూడా దేవుని కృప ఉండాలనే ఆకాంక్షిస్తూ ఉద్యోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. ఇదంతా కూడా ఒక మంచి మార్గాన్ని ఎంచుకోవడమే తప్ప ఇది ప్రత్యేక మతం కాదని గుర్తుంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒక కుటుంబంలోని అందరూ కూడ క్షేమంగా ఉండాలి పెద్దలను గౌరవించే లాగా ఉండాలి అన్నది ఎలాగైతే కోరుకుంటామో అదే ఏసుక్రీస్తు ప్రభువు వారు అందరి క్షేమం కోసం చెప్పిన మార్గం అనేది ప్రతి ఒక్కరు నమ్మవలసిన పరిస్థితి ఉందన్నారు. దేవుడిని నమ్ముకుంటే మూఢ?త్వం పోతుందని,చెడు వ్యసనాలకు దూరమవుతారనేది గర్వంగా చెప్తాన్నారు. లోక రక్షకుడిగా



ఏసుక్రీస్తు ప్రభువారు ఈ లోకంలో జన్మించి మానవాళి పాప రక్షణ కోసమే ఏసుక్రీస్తు ప్రభువారు తన రక్తాన్ని చిందించి సిలువపై వేలాడుతూ ఏసుక్రీస్తు ప్రభువారు పలికిన ఏడు మాటలను బైబిలు గ్రంథం చూపించిన విధంగా ఐ యాం సంఘ కాపర్లు స్మరించుకున్న విధానం మరువలేనిది అన్నారు. చివరి మాటగా ఏడవ మాట చెప్పి ఏసుక్రీస్తు ప్రభువారు శిలువపై మరణించారని చెప్పారు. అదేవిధంగా ఆయన చెప్పినట్లుగానే మరణమును జయించి తిరిగి మూడవ దినమున లేచిన గొప్ప సృష్టికర్త అని పేర్కొన్నారు. ఈ లోక పాపుల కోసమే ఆయన ఎన్నో ఇబ్బందులు పడి ప్రాణ త్యాగానికి సిద్ధం అయ్యారని చెప్పారు. అలాగే మండలంలోని అంతారం, చెంగోల్,రాజీవ్ గృహకల్ప, పట్టణంలోని మార్వడి బజార్ పలు చర్చిలలో మధ్యాహ్నం మూడు గంటల సమయం వరకు ఉపవాస ప్రార్థనలు చేసి బైబిల్ సందేశం తో పాటు ప్రార్థన గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ ఉద్యోగులు, క్రైస్తవులు ఉన్నారు.

vidyanjali
(A School Volunteer Programme)

## 'విద్యాంజలి పోర్టల్లో ప్రతి పాఠశాల యొక్క వివరణలు నమోదు చేయాలి'. ఎం ఈ ఓ వెంకటేశ్వర్లు

కల్హేర్. 18. ఏప్రిల్ ప్రజా జ్యోతి : సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్ మండలంలోని అన్ని ప్రభుత్వ, మరియు ఆధ్వర్యంలో స్థానిక సంస్థల పాఠశాలలు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలకు సంబంధించిన వివరాలను విద్యాంజలి పోర్టల్లో నమోదు చేసుకోవాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యాంజలి పోర్టల్ ద్వారా పాఠశాలలో సౌకర్యాలను మెరుగుపరుచుకోవడం కోసం దీన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఆన్లైన్ లో నమోదు చేయాలని సూచించారు

## ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెక్కుల పంపిణీ

- ఖేడ్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్



కల్హేర్. 18. ఏప్రిల్ ప్రజా జ్యోతి నారాయణఖేడ్: ఎన్నో ఏండ్లుగా ఇల్లు లేని నిరుపేదలు ఎదురుచూస్తున్న సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా నెరవేరబోతుందని ఖేడ్ మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మన్ దారం శకంర్ అన్నారు. శు క్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడత బిల్లు రూ.1 లక్ష చెక్కులను ఎంపిక చేసిన గ్రామాల లబ్ధిదారులకు శనివారం ఉదయం 12 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి చేతుల మీదుగా అందించనున్నారన్నారు. ఇంటి స్థలం ఉండి జాబితాలో పేరున్న వారికి,వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, పూడిగుడిసెలో నివాసం ఉంటున్నవారికి మొదటి విడతలో అవకాశం ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇల్ల పంపిణీ నిరంతర ప్రక్రియని అని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఎమ్మెల్యే సహకారంతో అందిస్తామన్నారు.

## భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

- చేవెళ్ల తహసిల్దార్ కృష్ణయ్య



చేవెళ్ల ఏప్రిల్ 18(ప్రజా జ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం 2025 సంబంధించిన అవగాహన సదస్సును చేవెళ్ల మున్సిపల్ పరిధిలో మల్కాపూర్ క్రాస్ రోడ్ వద్ద పద్మావతి కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే యాదయ్య హాజరవుతారన్నారు. కావున ప్రజలు ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# రైతుల తలరాత మార్చిందే కేసీఆర్

- రజతోత్సవ సభకు గులాబీ దండు కదం తొక్కాలి
- బీఆర్ఎస్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



కొడంగల్ ఏప్రిల్ 18 ప్రజా జ్యోతి న్యూస్: తెలంగాణ రైతుల తలరాత మార్చింది కెసిఆర్ అని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు, కోడంగల్ లోని బీఆర్ఎస్ 25వ రజతోత్సవ సభకు కొడంగల్ లో బీఆర్ఎస్ సన్నహాక సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా 25వ రజతోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ 2001 సంవత్సరంలో కెసిఆర్ టిఆర్ఎస్ పార్టీ స్థాపించి 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు గులాబీ దండు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున కదం తొక్కాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తికి పెద్ద ఎత్తున తరలివెళ్లామన్నారు. పట్టిన జెండాను విడవకుండా ప్రజలను ఏకం చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించిన కేసీఆర్ స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు, భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణ వైపు చూసే విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి తెలంగాణను దేశానికి మోడల్ గా నిలబెట్టారన్నారు, తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం తో పాటు ఇతర రాష్ట్రాలు అమలు చేశాయన్నారు, మొట్టమొదటిసారిగా రైతులకే పెట్టుబడి సాయం అందించిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు, గతంలో ప్రభుత్వాలకు శిస్తులు కట్టేదని బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత శిస్తులు లేకుండా రైతులకే సహాయం అందించారన్నారు, బీఆర్ఎస్ పార్టీ మాత్రం ప్రజలతోనే కలిసి ముందుకు వెళ్తుందని చెప్పారు, తెలంగాణ కోసం అనునిత్యం పరితపించే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని అందుకే ప్రజలు తమ ఇంటి పార్టీగా అక్కున చేర్చుకుంటారని అన్నారు, ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దామోదర్ రెడ్డి.బోంరాస్ పేట్ మండల అధ్యక్షులు కోట్ల యాదగిరి. మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి. సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి. గోవర్ధన్ రెడ్డి. మహేందర్ రెడ్డి. మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీములు. మాజీ సర్పంచ్ రమేష్ బాబు.ఎర్రన్ పల్లి శ్రీనివాస్. రవీంద్ర చారి. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ప్రార్థనల మధ్య గుడ్ ఫ్రైడే వేడుకలు

- ఉపవాస ప్రార్థనలో గీతాఆలాపనలు
- మైనార్టీ నాయకుడిని సన్మానించిన సంఘ కాపరి ప్రవీణ్



తాండూర్ ఏప్రిల్ 18 ప్రజా జ్యోతి: ఏసుక్రీస్తు ప్రభువు వారు ఈ లోకంలో మానవుడిగా జన్మించి 33 సంవత్సరాలు పాటు జీవించి అనంతరం సిలువ త్యాగంతో మరణించిన రోజును గుడ్ ఫ్రైడే గా జరుపుకుంటామని జినుగుర్తి మెథడిస్ట్ చర్చి సంఘ కాపరి సందేశం ద్వారా క్రైస్తవులకు తెలియజేశారు. శుక్రవారం రోజు ఉదయం నుండి మూడు గంటల సమయం వరకు క్రైస్తవులు ఉపవాస దీక్షతో ఉండి బైబిల్ సందేశం తో పాటు గీతాలాపనలతో మారు మారుమ్రోగింది. ఏసుక్రీస్తు ప్రభువారు శిలువపై పలికిన ఏడు మాటలను జ్ఞాపకం చేసుకున్నారు. ఇట్టి ప్రార్థన కూటమునకు ముఖ్య అతిథులుగా తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజ్మత్ అలీ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకొని బైబిల్ సందేశం తో పాటు దేవుడి మరణ వార్తను జ్ఞాపకం చేసుకోవడం శుభసూచికమన్నారు. అదేవిధంగా మూడవ దినమున జరుపుకునే ఈస్టర్ వేడుకలలో క్రైస్తవులకు అందరికీ కూడా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తానని ప్రకటించారు. తదుపరి సంఘ కాపరి ప్రవీణ్ తాండూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు యువకులు ఉన్నారు.

## మెడికల్ కళాశాల నిర్మాణం పనులను ఆపాలని రైతులు అడ్డుకునే యత్నం



కొడంగల్ ఏప్రిల్ 18 ప్రజా జ్యోతి న్యూస్ : మెడికల్ , వెటర్నరీ కళాశాల నిర్మాణం కోసం బుల్డోజర్లతో చదును చేస్తున్న భూమిలో పనులను ఆపాలని అప్పాయిపల్లి రైతులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకోగా పోలీసులకు రైతులకు మధ్య తోపులాట జరిగింది, పోలీసులు అడ్డుకోవడంతో రైతులు అక్కడే కూర్చొని ధర్నా నిర్వహిస్తున్నగా ఎస్పై జివి.సత్య నారాయణ కలగజేసుకుని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు, ఈ సందర్భంగా రైతులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్, శేఖర్ గౌడ్, నర్సప్ప లు మాట్లాడుతూ మెడికల్, వెటర్నరీ కళాశాల నిర్మించేందుకు ప్రభుత్వం 19 సర్వే నెంబర్ లో భూములను ఎకరాకు పది లక్షలు ఇస్తామని చెప్పి తీసుకుందని ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వలేదని పూర్తిస్థాయి పరిహారం ఇచ్చిన తర్వాతనే పనులు చేపట్టాలన్నారు, ఆరు లక్షల మాత్రమే ఇచ్చారని పూర్తిస్థాయి పరిహారం ఇవ్వకుండా కబ్జా చేయడం ఏమిటని ప్రశ్నించారు, కాంగ్రెస్ కార్యకర్తలతో కుమ్మక్కై 70 నుండి 20 లక్షల వరకు భూములు లేని వారికి ఇచ్చినట్లు తెలిపారు, రైతులం నష్టపరిహారం ఇవ్వనందున రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు ఆడుకోవడం సరైనది కాదన్నారు, భూములు లేని వారికి ఏ విధంగా డబ్బులు అందయో ఉన్నత అధికారులతో ఎంక్వయిరీ చేయించాలని డిమాండ్ చేశారు, నిజమైన లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు ఇచ్చిన డబ్బులను ఎంక్వయిరీ చేసి భూములు ఉన్న రైతులకు న్యాయం చేయాలన్నారు, భూములు లేకుండా డబ్బులు తీసుకున్నా వారికి, అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు, నష్టపరిహారం ఇచ్చేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు, ఈ కార్యక్రమంలో అగ్గనూరు నర్సమ్మ. బుగ్గయ్య. బుగ్గమ్మ. పకీరప్ప. అమృతప్ప. కిష్టయ్య గౌడ్. తెలుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం



**(ప్రజా జ్యోతి )వంగూరు ఏప్రిల్ 18 :** నాగర్ కర్నూల్ జిల్లా వంగూర్ మండల పరిధిలోని విద్యుత్ లైన్ మరమత్తు కోసం 33/11KVవంగూర్ సబ్‌స్టేషన్ మరియు సర్వారెడ్డిపల్లి సబ్‌స్టేషన్, డిండి చింతపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామలలో శనివారము రోజున ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఇంచార్జి ఏఈ వెంకటేష్ పేర్కొన్నారు ఇట్టి విషయాన్ని రైతులు మరియు వినియోగదారులు అందరూ విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

# కారు మోటార్ సైకిల్ ఢీ యువకుడు మృతి



**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 18(ప్రజా జ్యోతి):** నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గేటు వద్ద శుక్రవారం రాత్రి టీ ఎస్ 13 ఇయు 7878 నెంబర్ గల కారు-మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో బాలరాజు (27) అని యువకుడు మృతి చెందాడు.రెండు వాహనాలు ఎదురు ఎదురుగా ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులలో నాగర్ కర్నూల్ మండలం గన్యాగుల గ్రామానికి చెందిన బాలరాజు అనే యువకుడు మృతి చెందగా పెద్దముద్దునూరు గ్రామానికి చెందిన మల్లేష్ కు తీవ్ర గాయాలు అయ్యాయి.మృతుడు బాలరాజు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో లెక్చరర్ గా పనిచేస్తున్నాడు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బోల్తా

**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)** గ్రామపంచాయతీ ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని నత్నయపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రమేష్ పంచాయతీ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా గ్రామంలోని ఓ వ్యక్తి దినకర్మ నిమిత్తం పంచాయతీ ట్రాక్టర్ను ఉపయోగించేందుకు చెరువు కట్ట వైపు తీసుకెళ్తుండగా అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో డ్రైవర్ కి ఎటువంటి నష్టం జరగలేదు.



# బాలికల అభ్యున్నతికి భరోసా కల్పిస్తున్న కేజీబీవీలు







- ☐ జిల్లా విధ్యాధికారి ఏ.రమేష్ కుమార్
- ☐ కేజిబివి లు అమ్మాయిల వ్యక్తిత్వ వికాసానికి బాటలు
- ☐ బాలికల విద్యాభివృద్ధి అధికారి శోభారాణి
- ☐ కస్తూర్బాలో ప్రారంభమైన ప్రత్యేక కార్యక్రమాలు

**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 18(ప్రజా జ్యోతి) :** అమ్మాయిల ఉన్నత విద్యకు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని ఈ విధ్యాల యాలు బాలికలకు నాణ్యమైన,ఉచిత విద్యను అందిస్తూ,బాలికల బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నాయని జిల్లా విద్యాధికారి ఏ.రమేష్ కుమార్ అన్నారు.పేదరికం లేదా ఇతర కారణాల వల్ల చదువు మానేసిన బాలికలకు కేజీబీవీలు ఉన్నత విద్యకు సురక్షితమైన రహదారులుగా మారుతున్నాయి.నాగర్ కర్నూల్ జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను మరింత బలోపేతం చేసేందుకు నేటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.6 నుండి 9వ తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షలు గురువారంతో ముగియడంతో శుక్రవారం నుండి ఈ నెల 23వ తేదీ బుధవారం ఈ విద్యా సంవత్సరం చివరి రోజు వరకు వారం రోజుల పాటు బాలికలకు రోజుకో కార్యక్రమం నిర్వహించేలా జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి,అన్ని కేజీబీవీలో శుక్రవారం నుండి ప్రారంభించారు.నాగర్ కర్నూల్ జిల్లాలో మొత్తం 20 కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మొత్తం 4000 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. చదువుతోపాటు సంస్కృతిక,యోగసాధన, వ్యక్తిగత నైపుణ్యాల వంటి కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నారు.ఆరు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాన్ని విద్యార్థులకు నిర్వహించేలా జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు శుక్రవారం ఉపాధ్యాయినిలకు దిశా నిర్దేశం చేశారు. మొదటి రోజు కార్యక్రమాల సమావేశం నిర్వహించి, విద్యార్థినులను సమాయత్తం చేశారు.రెండో రోజు శనివారం బాలికలకు నచ్చిన, ఇష్టమైన కథలను తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో రాయడం, చదవడం చేయిస్తారు. మూడో రోజు ఆదివారం విద్యార్థినులు స్పోకెన్ ఇంగ్లిషు,పబ్లిక్ స్పీకింగ్ కార్యక్రమం కింద తమను తాము పరిచయం చేసుకోవడంతోపాటు తల్లిదండ్రులను పరిచయం చేయిస్తారు.నాలుగో రోజు సోమవారం అమ్మా నాన్నలకు తెలిసేలా విద్యార్దినులు ఆకాంక్షలను చదివి వినిపించడం ,తల్లిడండ్రుల ఆకాంక్షలను తెలుసుకుంటారు.అయిదో రోజు మంగళవారం ఇప్పటి వరకు కేజీబీవీల్లో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారి స్ఫూర్తిగా థలు, ఆత్మగౌరవ కార్యకలాపాలపై ఉపాధ్యాయినులు వినిపిస్తారు. ఆరో రోజు బుధవారం జీవిత నైపుణ్యాలపై అవగాహన చెస్తూ సురక్షితమైన, బాధ్యతాయుత మైన ప్రవర్తన,బాల్య వివాహాలపై స్కిట్ల రూపంలో అవగాహన కార్యక్రమం,బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తారు.అదే రోజు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థినుల చదువుల్లోని ప్రగతిని వివరిస్తారు. ఈ విద్యా సంవత్సరం ముగింపు పలుకుతూ 24వ తేదీ నుండి వేసవి సెలవులను ప్రకటిస్తారు. -కేజిబివి లు అమ్మాయిల వ్యక్తిత్వ వికాసానికి బాటలు -జిల్లా బాలికల విద్యాభివృద్ధి అధికారి శోభా రాణి అమ్మాయిల వ్యక్తిత్వ వికాసానికి కేజిబివి లు బాటలు వేస్తాయని జిల్లా విద్యాభివృద్ధి అధికారి శోభా రాణి అభిప్రాయం వ్యక్తం చెసారు.జిల్లా లోని కేజీబీవీల బాలికల సమయం వృథా గాకుండా,రోజూ నిర్వహించే కార్యక్రమాలు వారి అభ్యున్నతికి బాటలు వేసేలా ఉన్నాయని స్వతహాగా వారు స్ఫూర్తి పొందేలా, మిగిలిన విద్యార్థినుల స్ఫూర్తిగాథలతో వారు ముందుకు నడిచేలా కార్యక్రమాలు ఉంటున్నాయని ఇవి ప్రవేశాల పెంపుతో పాటు, సమాజంలో బాలికలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా కూడా ఉపయోగపడనున్నాయని జీబీవీలో బాలికలను చదువులపై ఆసక్తిని పెంచడంతోపాటు,సమాజం లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా ఆత్మవిశ్వాసంతో ఉండేందుకు బాలికలకు ఇలాంటి కార్యక్రమాలు ఇంతగానో ఉపయోగపడతాయని,పాఠశాల స్థాయిలోనే ప్రతి అంశాన్ని తెలుసుకోవడం ద్వారా బాలికలు జీవితంలో సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం నేర్చుకోవాలనే తపన పెంపొందుతుందన్నారు.












## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా భూభారతి అమలు:

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్....**

**అల్లాదుర్గం ఏప్రిల్ 18 (ప్రజాజ్యోతి):** అల్లాదుర్గం భూభారతి పోర్టల్ అమలులో భాగంగా శుక్రవారం అల్లాదుర్గం మండలం చేవెళ్ల గ్రామం రైతు వేదికలో భూభారతి చట్టం -2025 ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూముల విషయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడిన సంవత్సర కాలంలో పరిష్కరించుకోవడానికి భూభారతి ద్వారా అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. భూ సమస్యలపై గతంలో కోర్టులను ఆశ్రయించే వారు అని నేడు కోర్టులను ఆశ్రయించకుండానే షెడ్యూల్ (ఏ ) ను ఏర్పాటు చేసి భూమి విలువ ఐదు లక్షలు లోపు ఉన్న పక్షంలో ఆర్డీవో స్థాయి, ఐదు లక్షల పై గా ఉన్న పక్షంలో కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించడానికి అవకాశం కల్పించాలని తెలిపారు. భూమి విషయంలో దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఆ రోజు నుండిసంవత్సరకాలంలోపు సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ స్థాయిలో సమస్యను పరిష్కారం కానిపక్షంలో సి సి ఎల్ ఏ కు ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం మండల తాసిల్దార్లు, సబ్ రిజిస్టర్ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారని, ఇకనుండి చేసే రిజిస్ట్రేషన్ లను అన్ని పరిశీలించిన అనంతరమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు.గతంలో ధరణిలో కొన్ని లోపాలుండడం వల్ల భూ సమస్యలు పరిష్కారం కాలేదని, ఇప్పుడు ప్రభు త్వం రూపొందించిన భూ భారతిలో వాటిని సరి చేసిందన్నారు. భూ భారతిలో రెవెన్యూ రికార్డులను సరిగ్గా మె యింటెన్ చేస్తారని, ప్రతి సంవత్సరం భూముల రికార్డుల ను తీసి ఆ ఫైళ్లను తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరు స్తామన్నారు. ఇప్పుడు అమలు చేస్తున్న భూభారతిలో సై తం ఎలాంటి లోపాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కో రారు. భూమికి సంబంధించి ఏదైనా తప్పు జరిగితే సంబంధిత తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లవచ్చని అక్కడ పరిష్కారం కాకపోతే ఆర్డీవోకు అప్పీలు చేసుకోవచ్చని అ క్కడ కూడా న్యాయం జరక్కపోతే కలెక్టర్‌కు అప్పీలు చేసు కునే అవకాశం భూభారతిలో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు భూభారతి పోర్టల్ లో ఉన్న వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నాగేష్ , ఆర్డిఓ రమాదేవి తాసిల్దార్ మల్లయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేషారెడ్డి, సీనియర్ నాయకులు సుభాష్ రావు, మాజీ ఎంపిటిసి విట్టల్ రెడ్డి, చంద్రశేఖర్ రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 97-పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జాతర భక్తులకు అన్నదనం

అల్లాదుర్గం.. 1997 పదవ తరగతి విద్యార్థులు అల్లాదుర్గం బేతాళ స్వామి జాతర ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, బ్రహ్మం, నర్సింలు, వీరేశం, సిద్దేశ్వర్, వీణ, తదితరులు ఉన్నారు.

# భూ వివాదాలు పరిష్కారాలకు భూభారతి,, రైతులకు ఇచ్చిన మాట నిలుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజలకు సన్నబియ్యం సకల సౌకర్యాలు అందిస్తున్న రేవంత్ రెడ్డి,**
**ధరణి లో కోల్పోయిన వారికి ఊరట,,, మెదక్ ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రావ్**

**ప్రజా జ్యోతి రామాయంపేట18:** ఏప్రిల్ 2025 భూ వివాదాలు సత్వర పరిష్కారానికి భూ భారతి చట్టం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. భూ భారతి నూతన చట్టంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కష్టాలను తీర్చే ప్రభుత్వంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ధరణి విషయమై మాటను ఇచ్చారని, ధరణి స్థానంలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు, ప్రజలకు ఉపయోగపడే నూతన భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చారని అన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజల అభిప్రాయాలను తీసుకున్న తదపరి భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. రైతులు వారి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే విధంగా పగడ్బందీగా ఈ చట్టాన్ని అమలు చేసేందుకు జిల్లాలో రెవెన్యూ యంత్రాంగం పనిచేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి పేదవాని ఆకలి తీర్చేందుకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించి వారు ఉన్నత స్థానంలో స్థిరపడాలనే ఉద్దేశంతో రామాయంపేట పట్టణంలో 200 ఎకరాలలో పాఠశాలల నిర్మించి విద్యాభివృద్ధికి కృషి చేయనున్నట్లు చెప్పారు. భూ భారతి చట్టంపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూ భారతి చట్టం మార్గదర్శకాలను రైతులు, ప్రజలకు తెలియజేసేందుకు జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భూ భారతి చట్టంలో భూ సమస్యల పరిష్కారం కోసం కొత్త రూల్స్ వచ్చాయన్నారు. నూతన చట్టం రూల్స్ గురించి తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లకు, ఆర్ఐలకు కలెక్టరేట్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ నూతన చట్టం భూ భారతి, దానిలోని



అంశాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఇంతకు ముందు ఉన్న ధరణిలో కోల్పోయిన భూ హక్కులు ఏవైతే ఉన్నాయో ఇప్పుడు వచ్చిన కొత్త చట్టంలో ఎలాంటి హక్కులు ఉన్నాయనేది తెలియజేసేందుకే ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న రైతులు, ప్రజలు ఇంతకు ముందు ధరణిలో ఎలాంటి హక్కులు ఉన్నాయి, ఇప్పుడు భూ భారతి చట్టంలో ఎలాంటి హక్కులు ఉన్నాయనే అంశాల గురించి అడిగిన సందేహాలపై అవగాహన కల్పించారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో నూతనంగా వచ్చిన భూ భారతి చట్టం గురించి ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా స్థాయిలో రైతులకు, ప్రజలకు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. నూతన చట్టం ద్వారా తప్పులు సవరించుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే తహసీల్దార్ రిపోర్ట్ మొదలుకొని ఆర్డిఓ, కలెక్టర్, ఆపైన సిసిఎల్ఏ వరకు అప్లై చేసుకునే అవకాశం ఉందన్నారు. త్వరలోనే గ్రామ పాలన అధికారులను ప్రభుత్వం నియమించనుందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి రామాయంపేట తహసీల్దార్ రజనీకుమారి ఆర్ఐ

# వైభవంగా బేతాళ స్వామికి జాతర బండ్ల ప్రదర్శన

**వేలాదిగా తరలివచ్చిన భక్తులు**

**అల్లాదుర్గం ఏప్రిల్ 18 (ప్రజాజ్యోతి):** మెదక్ జిల్లా ఏడుపాయల జాతర తర్వాత రెండవ అతిపెద్ద జాతరగా పేరుగాంచిన అల్లాదుర్గం బేతాళ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బేతాళ స్వామి కి వైభవంగా కన్నుల పండుగ ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గ్రామ పురవీధుల గుండా ఎడ్లబండ్లను రంగురంగుల సుందరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో, డప్పు వాయిద్యాల నడుమ ఆటపాటలతో, బేతాళ స్వామి కి గోవిందా గోవిందా అని స్మరించుకుంటూ ఆలయం చుట్టు 5 ప్రదక్షిణలు చేసి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి కర్ణాటక మహారాష్ట్ర రాష్ట్రాల నుండే కాకుండా తెలంగాణ జిల్లాల నుండి, మండలంలోని చుట్టుపక్కల గ్రామాల వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాలను. తిలకించడానికి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం జనజాతరగా మారింది.. ఈ సందర్భంగా సిఐ రేణుక రెడ్డి, ఎస్సై ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో జాతర లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



# అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ వా లేక బిచ్చాపోనివా...?



**సిర్గాపూర్ ఏప్రిల్ 18ప్రజాజ్యోతి):** సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని ఉజలం పాడ్ గ్రామానికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఈసీ సభ్యుడు అరుణ్‌రాజ్ శేరికార్ పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ...అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీవా లేక బిచ్చాపోనివా బిచ్చపోల్ల కన్నా దరిద్రంగా మాట్లాడుతున్నావు ఒక ప్రధానిని పట్టుకొని తంథా అంటావా...? ప్రపంచం మొత్తం మా ప్రధాని నరేంద్ర మోడీ వైపు చూస్తున్నారు కంటికి కనిపించలేదా కళ్లల్లో ఏమి పెట్టుకున్నావ్ అని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో పాలన చేయట%శీ% చేత కాని కాంగ్రెస్ పార్టీ మోడీని తిట్టేంత ధైర్యం ఉందా నీకు అని అరుణ్‌రాజ్ శేరికార్ అన్నారు. రాజ్యంగం రాసిన అంబేద్కర్ గారిని 2 సర్లు వోడించింది మీ కాంగ్రెస్ ప్రభుత్వం కాద అని అడుగుతున్నావా. అంబేద్కర్ భరత రత్న ఇచ్చి దేశ గౌరవం కాపాడింది బీజేపీ పార్టీ అని మార్చిపోకన్నారు. నువ్వు భారత దేశ స్వతంత్రం గురించి మాట్లాడుతున్నావా అని అరుణ్‌రాజ్ శేరికార్ అన్నారు.

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి

**మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్**



**చిన్నకోడూర్ , ఏప్రిల్18(ప్రజా జ్యోతి):** మండల పరిధి అల్లీపూర్ గ్రామంలోని నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరి కృష్ణ సహకారం తో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మీసం మహేందర్ సీ .సీ రోడ్డు నిర్మాణం.గ్రామస్తుల తో కలిసి కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నాడు గాంధీ కళలు కన్నా గ్రామ స్వరాజ్యాన్ని సాధించడమే కాంగ్రెస్ లక్షమనీ ప్రజా ప్రభుత్వం ప్రజా పాలనలో గ్రామాల అభివృద్దే లక్షంగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి ఉపాధ్యక్షులు పరశురాములు , గ్రామ శాఖ అధ్యక్షులు రాజు,ఉపాధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి ముత్యం, యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు మహేష్, ఇందిరమ్మ కమిటీ మెంబర్ భూమయ్య, నాయకులు బాబు, నాగరాజ్, రాజు, మల్లేశం, బాపురెడ్డి, రాజిరెడ్డి, కొండయ్య, కర్ణాకర్ రెడ్డి, బాలయ్య, బాల్ రెడ్డి, రాజిరెడ్డి, రాములు, రాజు,తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 27న ఛలో వరంగల్



**చిన్నకోడూర్, ఏప్రిల్18(ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలో బిఆర్ఎస్ ఈనెల 27న వరంగల్ లో నిర్వహించే బి ఆర్ ఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేస్తున్నటువంటి బహిరంగ సభకు మండలం నుంచి విద్యార్థి యువత పెద్ద ఎత్తున పాల్గొని సభలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వీ యువజన విభాగ అధ్యక్షులు గుండెల్లి. వేణు మాట్లాడుతూ మాజీమంత్రి సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు సూచనల మేరకు ఈనెల 27న నిర్వహించే సభకు సిద్దిపేట రంగదాంపల్లి చౌరస్తా నుండి సభ ప్రాంగణం వరకు విద్యార్థి యువత పాదయాత్ర ద్వారా వెళ్లాలని అన్నారు. 25న సిద్దిపేట రంగదాంపల్లి చౌరస్తా నుంచి మొదలుకొని 27 వరకు సభా ప్రాంగణం వద్దకు చేరుకోవాలి అని అన్నారు. ఈ పాదయాత్రకు మండలం నుంచి అన్ని గ్రామాల నుంచి విద్యార్థి యువత పెద్ద ఎత్తున పాల్గొని ఇటు ఒక పాదయాత్రను దిగ్విజయం చేయగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, విద్యార్థి విభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భానుచందర్, యువ నాయకులు సాయి ,దేవేందర్ ,సుధాకర్, రఘువర్మ, ఆనంద్ ,శ్రావణ్ ,గౌడ్, శేఖర్ అనిల్ ,చందు మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర పాల్గొన్నారు.

# నేడు బిఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సభ

**హాజరుకానున్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి**

**చలో వరంగల్ కార్యక్రమానికి కార్యకర్తలకు దశ నిర్దేశ**

**రాయపోల్ ఎప్రిల్ 18 ప్రజా జ్యోతి:** ఈనెల 27న వరంగల్ జిల్లా ఎలుకతుర్తి లో జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ 25 ఏళ్ల పండుగను విజయవంతం చేయాలని రాయపోల్ మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని జిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగే మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు. మాజీ ఎంపీపీ. మాజీ జెడ్పిటిసి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు. సొసైటీ డైరెక్టర్లు. పార్టీ బూత్ కమిటీ సభ్యులు మహిళా కమిటీ సభ్యులు. యువజన కమిటీ సభ్యులు. మైనార్టీ కమిటీ సభ్యులు. ఎస్సీ మోర్చా కమిటీ సభ్యులు వివిధ కుల సంఘాల కమిటీ సభ్యులు అభిమానులు పెద్ద సంఖ్యలో




తరలిరావాలని పిలుపునిచ్చారు. 27న వరంగల్లో జరిగే సభకు మండలం నుంచి కార్యకర్తలు ఎలా వెళ్లాల్సి ఉంటుందని దశా దిశా నిర్దేశించడం జరుగుతుందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వం లో జరుగనున్న నేపథ్యంలో ,ఆ సభకు తరలి వెళ్లేందుకు సంబంధించి ఏర్పాట్ల కోసం చర్చించేందుకు "సన్నాహక సమావేశం" ఏర్పాటు చేయడం జరుగిందన్నారు. మండలంలోని బిఆర్ఎస్ పార్టీ ఆయా గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తల్లిదవాలని పేర్కొన్నారు.

# పుట్టాపహాడ్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ప్రథమ వార్షికోత్సవ

వికారాబాద్ జిల్లా కులకచర్ల మండల పరిధి పుట్టాపహాడ్ గ్రామంలోదవిద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించి ఉన్నత శిఖరాలను ఎదగాలని మండల విద్యాశాఖ అధికారి హబీబ్ అహ్మద్, డిప్యూటీ డీఈవో హరిచందర్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవుజా నాయక్ అన్నారు. గురువారం కుల్కచర్ల మండల పుట్టాపహాడ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ అన్ని రంగాలలో తమదైన ముద్రను వేసుకుంటున్న ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాభ్యాసం జరుగుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆంజనేయులు,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బి వెంకటయ్య,ఎం శ్రీశైలం, సతీష్,వెంకటేష్,పంచాయతీ కార్యదర్శి కవిత,కీర్తిశేషులు ప్రధానోపాధ్యాయులు జె హనుమయ్య కుటుంబ సభ్యులు,స్కూల్ చైర్మన్ చిల్ల లక్ష్మి,మాజీ వైస్ ఎంపీపీ రాజశేఖర్ గౌడ్,చిల్ల యాదయ్య,చిల్ల కృష్ణయ్య ఎక్స్ ఆర్మీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి నరేందర్,జై కృష్ణయ్య ఎక్స్ ఆర్మీ,కె శేఖర్ రెడ్డి ఎక్స్ ఆర్మీ, బి హరినాథ్ రెడ్డి,ఎస్ శ్రీనివాసులు మాజీ వార్డు మెంబర్,బోయిని కేశవులు,వెంకటేష్ గౌడ్, ఒంగురు మల్లేష్,జె కురుమయ్య,బంకిటి కృష్ణారెడ్డి, డాక్టర్ గోపాల్,బంకిటి వీరారెడ్డి, బంకిటి శ్రీనివాస్ రెడ్డి,ఎస్ శ్రీశైలం ఎక్స్ ఆర్మీ, డాక్టర్ ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి చిల్ల వెంకన్న, బోయిని పెద్ద అంజయ్య, ఆవుసుల సతీష్,బంకిటి శ్రీకాంత్ రెడ్డి,కారోబర్ రాములు,విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.